క్లుప్తంగా

జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



టేకుమట్ల : మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ గురువారం దసరా పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేస్తున్న వారి సేవలు అభినందనీయమన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కుటుంబ సభ్యులతో దసరా బతుకమ్మ పండగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎంబాడి స్వామి, గ్రామస్తులు పొనగంటి రమేశ్, ఇసంపెల్లి పోశాలు, దేశిని మొగిళి, విష్ణు, సుధాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత ఖాళీలను స్థానికులతో భర్తీ చేయాలి

భూపాలపల్లి రూరల్ : ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగ ఖాళీలను స్థానిక అభ్యర్థులతోనే భర్తీ చేయాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్ నాయక్ గురువారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2024 నియామకాల్లో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖాళీలను మైదాన ప్రాంత గిరిజనేతరులతో భర్తీ చేయడం ద్వారా, ఈడబ్ల్యూఎస్ కోట వల్ల ఏజెన్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



మొగుళ్లపల్లి : ట్రాక్టర్ ట్రాలీ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చిట్యాల సీఐ మల్లేష్, స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు. సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గణేశ్‌పల్లె గ్రామానికి చెందిన వల్లాల రాజునారాయణ ట్రాక్టర్ ట్రాలీని గత ఫిబ్రవరిలో తన వ్యవసాయ పొలం వద్ద ఉంచగా అపహరణకు గురైంది. దీంతో ట్రాలీ యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కోర్కిశాల గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బద్దంపల్లి గ్రామానికి చెందిన యాళ్ల చిరంజీవి ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో వెళ్తుండగా ట్రాలీకి సంబంధించిన పత్రాలు సరిగా లేకపోవడంతో అనుమానం వచ్చిన దర్యాప్తు చేశారు. ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించినట్లు గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవవహరించిన కానిస్టేబుల్ సారంగపాణి, హోంగార్డు రవిని సీఐ అభినందించి రివార్డు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం)-మోరంచపల్లి రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన చిలువేరు జంపయ్య చెల్పూరుకు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో కొత్తపల్లి-మోరంచపల్లి ప్రధాన రహదారిపై ఎక్సెల్ వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో జంపయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైనా చికిత్స కోసం వరంగల్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో ఇసుక క్వారీ నుంచి తరలిస్తున్న లారీల వద్ద సర్పంచ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వారిపేరుతో ఎందుకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గోదావరి ఘాట్ వద్ద లైటింగ్ లేక మహిళల ఇబ్బంది

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి ప్రధాన ఘాటు వద్ద సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి వచ్చిన మహిళలకు లైటింగ్ లేక ఇబ్బందులు పడ్డారు. రెవెన్యూ, పంచాయతీ, దేవాదాయశాఖలు ముందస్తుగా లైటింగ్‌పైన దృష్టి పెట్టకపోవడంతో ఇబ్బందులకు గురైనట్లు వారు పేర్కొన్నారు. చీకటిలోనే మహిళలు గోదావరిలో దిగి నిమజ్జనం చేశారు. కనీసం గోదావరి ఒడ్డున ఉన్న హైమాస్ట్ లైట్లకు కూడా విద్యుత్ సరఫరా ఇవ్వలేదని వారు ఆరోపించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై స్థానికులు మండిపడుతున్నారు.

టేకుమట్ల: రాఘవరెడ్డిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



టేకుమట్లలో బతుకమ్మ ఆడేందుకు వెళ్తున్న మహిళలు



మొగుళ్లపల్లి: బతుకమ్మలతో వస్తున్న మహిళలు



సంబురంగా సద్దుల బతుకమ్మ

మొగుళ్లపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి రంగురంగుల గునుగు, తంగేడు, గుమ్మడి పూలతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించారు.చిన్న, పెద్దలు, యువతులు, మహిళలు, పట్టు వస్త్రాలు ధరించి బతుకమ్మలతో ఆటలాడేందుకు వాగు, చెరువుల వద్దకు బయలుదేరారు. వర్షం పడడంతో కొన్ని గ్రామాల్లో ఆటంకం ఏర్పడింది. పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ బతుకమ్మలను గంగమ్మ ఒడిలోకి జారవిడించారు. డీజే లేకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలు నిరాశ చెందారు.

చిట్యాల : మండలంలోని నైన్‌పాక, జూకల్, చల్లగరిగ, జడలపేట, తిర్మలాపూర్, అందుకుతండా, వరికోల్‌పల్లి గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు.

గణపురం : మండలంలో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు.ఆటపాటలతో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



మల్హర్: తాడిచర్ల చీటిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల సంబురం..

మల్హర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆడబిడ్డలు తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలను ఆటస్థలం వద్దకు తీసుకొచ్చి ఆడిపాడారు. బతుకమ్మలను మంగళ వాయిద్యాలతో ఊరేగించి చెరువుకులు, కుంటలో నిమజ్జనం చేశారు. అమ్మవారి నైవేద్యం సత్తుపిండిని ఒకరికొకరు పంచుకొని ఆనందగా వేడుకలు జరుపుకున్నారు.

భూపాలపల్లి రూరల్ : సద్దుల బతుకమ్మను గురువారం జిల్లా వ్యాప్తంగా మహిళలు బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఘనంగా నిర్వహించారు. తంగేడు, గునుగు, కట్ల, బీర, బంతి, గుమ్మడిపూలతోపాటు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. సాయంత్రం గ్రామాల్లో, వాడల్లో కూడళ్ల వద్ద మైదానాల్లో బతుకమ్మలను ఒక చోటుకు చేర్చి ఆడిపాడారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. కాళేశ్వరాలయం ఆవరణలో దేవస్థానం అధికారులు లైటింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. అనంతరం త్రివేణి సంగమ గోదావరిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గణపురం: బతుకమ్మను తీసుకెళ్తున్న మహిళలు





టేకుమట్ల: బతుకమ్మతో చిన్నారి, యువతి



మొగుళ్లపల్లి: భారీ బతుకమ్మతో యువకుడు



మొగుళ్లపల్లి: భారీ బతుకమ్మతో..



కాళేశ్వరం: గోదావరిలో బతుకమ్మల నిమజ్జనం



చిట్యాల: వెంకట్రావుపల్లిలో..



చిట్యాల: నైన్‌పాకలో..



గణపురం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



టేకుమట్లలో..



కాళేశ్వరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిట్యాల: వరికోల్‌లో..



కాళేశ్వరం: బతుకమ్మల మధ్యలో అమ్మవార్ల రూపాలు



బతుకమ్మ వేడుకలో పోలీసులతో మహిళా కానిస్టేబుల్



భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో..



రేగొండ: కొత్తపల్లిగోరిలో..



రేగొండ: కొడవటంచలో..

డీఎస్సీ అభ్యర్థులకు అభినందనలు



భూపాలపల్లి : ఎంపికైన ఉపాధ్యాయులను అభినందిస్తున్న గ్రామస్తులు

భూపాలపల్లి : మండలంలోని గోర్లవీడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. కాగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామస్తులు, హెల్పింగ్ హ్యాండ్ యూత్ సభ్యులు సన్మానించి అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మండల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మండల సాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటికంటి శంకర్, హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులు తోట విష్ణు, రాజపాల్ రెడ్డి, గోపు సునీల్ రెడ్డి, చీదురాల రవితేజ, దుబాసి రమేశ్, దొడ్ల రాజు, సకినాల సంతోష్, ఎడ్ల నరేశ్ పాల్గొన్నారు.

టీచర్ కొలువుకు మహిళా కానిస్టేబుల్

కాటారం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గడిపెల్లి తేజశ్రీ టీచర్ కొలువుకు ఎంపికయ్యారు.



తేజశ్రీ, కానిస్టేబుల్

ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జగిత్యాల జిల్లా నుంచి ఎస్జీటీ విభాగంలో 65వ ర్యాంకు సాధించి టీచర్ ఉద్యోగం పొందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తేజశ్రీ 2022లో కానిస్టేబుల్‌గా నియామకమై కరీంనగర్‌లో విధులు నిర్వర్తించింది. జీఓ 371లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అయి విధుల్లో ఉన్నారు. స్వగ్రామంలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనే లక్ష్యంతో తేజశ్రీ పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించారు. తేజశ్రీ టీచర్ కొలువుకు ఎంపికవడంతో పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్



భూపాలపల్లి రూరల్: తీజ్ బుట్టతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మల్హర్ : తీజ్ బుట్టలతో యువతులు, మహిళలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కమలాపూర్, గొల్లబుద్ధారం గ్రామాల్లో తీజ్ వేడుకలు

భూపాలపల్లి రూరల్ : బంజారాల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండల పరిధిలోని కమలాపూర్, గొల్లబుద్ధారం గ్రామాల్లో జరిగిన లంబాడీ, బంజారాల తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తీజ్ వేడుకల్లో లంబాడీలంతా ఏకతాటి పైకి వచ్చి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు పలువురు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

అడ్వాలపల్లి గ్రామంలో..

మల్హర్ : బంజారాల సంస్కృతికి ప్రతీక అయిన తీజ్ పండుగను మండలంలో అడ్వాలపల్లి గ్రామంలో మహిళలు, యువతి, యువకులు, తండావాసులు గురువారం ఘనంగా నిర్వహించారు.గిరిజనులు తమ సాంప్రదాయ పద్ధతిలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి తీజ్ ఉత్సవాన్ని జరుపుకున్నారు. బంజారా, లంబాడీ సంస్కృతీ, సంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ. తీజ్ అనగా గోధుమ మొలకలని, అవి అమ్మవారి ప్రతీరూపాలని తండా వాసులు పేర్కొన్నారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులుగా యువతులు ఎంతో నియమ నిష్టలతో మొలకలను బుట్టలలో పెంచుతారని వివరించారు. తొమ్మిది రోజుల అనంతరం యువతులు గోధుమ బుట్టలను ఎత్తుకొని, డప్పు చప్పుళ్లతో పాటలు పాడుతూ పూజలు చేశారు. అనంతరం తండాలోని చావిడి వద్ద ఏర్పాటు చేసిన తీజ్ బుట్టల పందిరి వద్ద యువతి, యువకులు నృత్యాలతో ఆడిపాడుతూ స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూక్య గోపి నాయక్, అజ్మీరా అకిరాం నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ రాజు నాయక్, అజ్మీరా బాలాజీ నాయక్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ



1962 వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి నియోజకవర్గంలోని పశు సంవర్ధకశాఖకు చెందిన 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర పశు వైద్య శాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భగేష్ మిశ్రాతో పాటు108, 102, 1962 వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ భూపాలపల్లిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అదేవిధంగా సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. మూగ జీవాలకు తగిన మెరుగైన వైద్యం అందిస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేనేజర్ మెరుగు నరేష్, పారవేట్ రమేష్, పైలట్ రాజశేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల ఊర చెరువు వద్ద వరి పైరు



భూమికి పచ్చాని రంగేసినట్లు..

ఈ ఏడాది భారీవర్షాలు కురవడంతో రైతులు అధికంగా వరిసాగు చేశారు. అయితే వరి నాట్లు వేయడం పూర్తవడమే కాకుండా ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట చివరి దశకు చేరుకుంది. దీంతో మండలంలో తాడిచర్ల పంచాయతీ పరిధిలో ఊరచెరువు కిందసాగు చేసిన వరి పైరు భూమికి పచ్చగా రంగేసినట్లు.. కనిపిస్తూ చూపరులను ఆకర్షిస్తోంది.

- మల్హర్